RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక


వరంగల్
సంపుటి : 3, సంచిక : 226 | మంగళవారం
ఆగస్టు 05, 2025 | పేజీలు : 4
వెల : రూ.3-00




## నైట్ డ్యూటీలు రద్దు చేయాలి

3లో..

# ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



- ట్రేడ్ లైసెన్స్ లేకుండానే పుట్టగొడుగుల్లా దుకాణాలు
- వరంగల్ మున్సిపల్ ఆఫీసర్లకు పట్టింపు లేదా?
- ప్రజా ప్రభుత్వంలో ప్రజల రక్షణపై నిర్లక్ష్యమా?
- సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి!?




**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

ప్రజా ప్రభుత్వంలో అధికారుల ఉదాసీనతతో సర్కారు ఆదాయానికి భారీగా గండి పడుతోంది. గ్రేటర్ వరంగల్ నగర పరిధి రోజురోజుకూ విస్తరిస్తున్న సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాష్ట్ర రెండో రాజధానిగా నగరం మరింతగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధికి, ప్రజల భద్రతకు సంబంధించి అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. సిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విషయాలపై దృష్టి సారించి.. వచ్చిన ఇన్‌కమ్‌తో సిటీ డెవలప్‌మెంట్ చేసేందుకు ప్రయారిటీ ఇవ్వాలి. కానీ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆఫీసర్లు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ట్రేడ్ లైసెన్సుల విషయంలో సంబంధిత శాఖ వారు కనీసంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా చేయడం లేదని తెలుస్తోంది.

**– ఫీల్డ్ లెవల్ ఇన్‌స్పెక్షన్స్ మరిచారా?**

రోడ్డుపైన నెలకొల్పే ప్రతి చిన్న వ్యాపార సముదాయం నుంచి అతి పెద్ద ఆఫీసు వరకు ప్రతి కమర్షియల్ వ్యాపారానికి సంబంధించి.. సంబంధిత ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలి. ట్రేడ్ లైసెన్స్ లేకపోతే దుకాణదారులు ఎవరూ కూడా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకూడదు. కానీ, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చాలా వ్యాపార సముదాయాలకు అసలు ట్రేడ్ లైసెన్స్ లేని సంగతి 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ఫోకస్ టీమ్ క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ వారు ఎందుకు ఇన్‌స్పెక్షన్ చేసి.. ఫైన్‌లు విధించడం లేదు?, దుకాణాదారుల వద్ద నుంచి ట్రేడ్ లైసెన్స్ జారీకి ఫీజు వసూలు చేయడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బల్దియాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చే ఈ విషయం పట్ల పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు ఎందుకు ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నారనేది అతి పెద్ద ప్రశ్నగా మారింది.

**– ప్రజల సం'రక్షణ', భద్రతపై ప్రశ్నలు**

గ్రేటర్ వరంగల్ నగరంలో ఎలాంటి అనుమతి తీసుకోకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపైన చర్యలకు సంబంధిత శాఖ వారు ఎందుకు జంకుతున్నారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. చిన్న స్థాయి దుకాణం నుంచి అతి పెద్ద కాంప్లెక్స్ వరకు పర్మిషన్స్ లేని వారిపై ఎందుకు స్పెషల్ డ్రైవ్స్ చేపట్టడం లేదని అడుగుతున్నారు. రూల్స్ వాళ్లకు వర్తింపజేయకుండా ఉండటంలో ఆంతర్యమేంటి, అసలు మర్మమేంటో తెలియడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. ఇష్టారీతిన ఎలాంటి అనుమతులు(ట్రేడ్ లైసెన్స్, ఎన్‌వోసీ ఇతర పర్మిషన్స్) లేకుండానే మరింత విచ్చలవిడిగా నగరంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వ్యాపార సముదాయాలు వెలుస్తాయని పేర్కొంటున్నారు. ఇక వ్యాపార కార్యకలాపాలు ఇష్టారాజ్యంగా సాగుతాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండబోదని, ఆరోగ్యం విషయమై కనీసంగా ప్రమాణాలు పాటించరని, నియంత్రణ అనేది ఇక ఉండబోదని హెచ్చరిస్తున్నారు. వ్యాపార సముదాయాల్లో ఏవైనా ప్రమాదాలు జరిగినా, ఫుడ్ సంబంధిత దుకాణాల్లో ఎలాంటి తయారీ తేదీ లేని, ఎక్స్‌పైర్ అయిన తినుబండారాలు విక్రయిస్తే.. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచినట్టే కదా? ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో ఎవరు బాధ్యత వహిస్తున్నారని బుద్ధిజీవులు కొందరు అడుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని..ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే.. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పని చేసేలా ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఇన్‌కమ్ వస్తుందని, అది ప్రజా సం'క్షేమానికి' ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



# శభాష్..అశోక్

**– 51 వసారి రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్న సామాజిక సేవకుడు**

**వేద న్యూస్,శాయంపేట:**

"ప్రార్థించే పెదవుల కన్న సాయం చేసే చేతులు మిన్న" అనే నానుడిని మాటల్లో చెప్పకుండా చేతల్లో ఆచరించి ఆదర్శంగా నిలిచారు సామాజిక సేవకుడు అశోక్. పరకాల పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటలో రక్తం అవసరం ఉందని ఆయనకు సోమవారం ఫోన్ రాగా, వెంటనే స్పందించారు. ఆస్పత్రికి వచ్చి బ్లడ్ డొనేట్ చేశారు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన అశోక్ ఇప్పటి వరకు 51 సార్లు రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా అశోక్ ను పరకాల హాస్పిటల్ ఆర్ఎంవో బాలకృష్ణ , రమేష్ , కృష్ణ , ప్రశాంత్, ప్రమీల తదితరులు అభినందించారు.

## ప్రజలకు చేరువ కావడమే లక్ష్యం

- ఆ దిశగా పోలీస్ శాఖ కృషి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ 2లో..

# ఆఫీసర్స్..బీ అలర్ట్

- ముంపు ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలి
- రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

**వేద న్యూస్, వరంగల్:**



వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు సమాయత్తం కావాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరిష్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయిలతో కలిసి.. గ్రేటర్ వరంగల్ నగరంలోవర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికల్లో భాగంగా, వరద ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై కూలంకషంగా సమీక్షించి.. సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**– ముందస్తు చర్యలు చేపట్టండి**


ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ.. గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని, సకాలంలో స్పందించకపోతే చిన్న సమస్య కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉంటుందని అధికారులను హెచ్చరించారు.అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నగరంలోని ప్రధాన నాలల స్థితిగతులు, పూడికతీత పై సమీక్షిస్తూ వరద నీరు నిలువకుండా నాలాల్లోకి పంపేలా ముందస్తుగా పనులు చేయాలని సూచించారు. బయటి నుంచి వచ్చే వరద నీటిని దారి మళ్లించేలా చూడాలని, జిల్లాలో బల్దియా ఆధ్వర్యంలో నిర్వహించబడే డిఆర్ఎఫ్, జిల్లా అగ్నిమాపక శాఖ, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు భారీ వర్షాల వల్ల నష్టం జరగకుండా ముంపు నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 6 ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని, అత్యవసత్యవసర

మిగతా 2వ పేజీలో..

## సీఎం సార్.. మాకు

# ట్రీట్‌మెంట్ చేయించండి!

- మెదడు సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమైన చిన్నారులు
- ప్రజా ప్రభుత్వం స్పందించి వైద్యానికి సాయం చేయాలని దంపతుల రిక్వెస్టు





**వేద న్యూస్, కమలాపూర్:**

ఈ చిత్రంలోని ఇద్దరు చిన్నారులు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కాశీంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ ఇమామ్, గోరీ బి దంపతులకు జన్మించిన ఏడేండ్ల రుక్సానా బేగం, నాలుగేండ్ల అమీనా. ఆ ఇద్దరు మెదడు సంబంధిత వ్యాధితో జన్మించారు. చిన్ననాటి నుంచి ఆ ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులు ఎన్నో ఆస్పత్రులకు తిరిగి చూపించారు. తమకు ఉన్న ఆస్తిని అంతా అమ్ముకొని చిన్నారుల వైద్యానికి ఖర్చు పెట్టారు. అయినా ఫలితం లేకపోయింది. కూలీ పని చేసుకుంటేనే కుటుంబం గడిచే పరిస్థితి ఆ ఫ్యామిలీలో నెలకొంది. రెక్కాడితే కానీ డొక్కాడదు.. అలాంటిది తమ బిడ్డలకు వైద్యం సంగతి ఎలా? అని వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మంచానికే పరిమితమైన చిన్నారులను కళ్ల ముందు అలా చూస్తూ.. ఉండలేక ఆ తల్లిదండ్రులు నరకం అనుభవిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పోషణ, చిన్నారుల ట్రీట్‌మెంట్.. విషయమై ఏం చేయాలో దిక్కుతోచక ప్రతిరోజూ ఆ కుటుంబం దుఃఖిస్తూనే కాలం వెల్లదీస్తోంది. ప్రస్తుత ప్రజాప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించాలని, తమ బిడ్డల వైద్యానికి సాయం చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. తమకు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులను గత సర్కారు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనైనా ఇవ్వాలని కోరుతున్నారు.

# ముగిసిన ఖమ్మం లారీ యజమానుల సంఘం ఎన్నికలు

**వేద న్యూస్, ఖమ్మం:**

ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికలు సోమవారం లారీ యూనియన్ ఆఫీస్‌లో జరిగాయి. ఇప్పటికే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఇద్దరు జాయింట్ సెక్రటరీలు పదవులు ఏకగ్రీవం కాగా, మరో ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పదవి కోసం జరిగిన ఎన్నికల పోటీలో ప్రధాన కార్యదర్శిగా బోయ శ్రీను, ఉపాధ్యక్షుడు గా ఇండిపెండెంట్ అభ్యర్థి పొట్లపల్లి సర్వయ్య పై తేజావత్ వీరన్న 78 ఓట్లతో విజయం సాధించారు నాలుగు కీలక పదవులతో పాటు ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవులు ఇంతకు ముందే ఏకగ్రీవయ్యాయి ఇందులో అధ్యక్షులుగా బోయపాటి కృష్ణకుమారి ఉపాధ్యక్షుడిగా బి శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీగా మస్తాన్ వలి మహమ్మద్ అలీమ్ తో పాటు ట్రెజరర్ గా చంద్ర సీతారాం తో పాటు మరో ఎనిమిది మందిని ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరపాలి

**- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వీరభద్రం**



**వేద న్యూస్, ఖమ్మం:**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోని కల్లూరు బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఫుడ్ పాయిజన్ చోటుచేసుకుంది. హాస్టల్‌లో ఉంటున్న 80 మంది విద్యార్థినులందరూ ఉదయం కిచిడీ తిన్న వెంటనే వారిలో 20 మంది విద్యార్థినులు కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు, తలనొప్పి, బలహీనతతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో వరుసగా జరుగుతున్న ఈ తరహా ఘటనలు విద్యార్థుల భద్రతపై సందేహాలను కలిగిస్తున్నాయి. ఇది ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనం అని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది,ఈ సంఘటనపై స్పందించిన తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఆహార ప్రమాణాలు, హాస్టల్ సదుపాయాలపై సర్వే నిర్వహించి తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని కోరారు. ఫుడ్ పాయిజన్ గురైన గిరిజన బాలికలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ యంత్రాంగం అందించాలనిఆయన డిమాండ్ చేశారు.

# బాలాజీనగర్ సొసైటీ అధ్యక్షునిగా శ్రీనివాస్

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట 47 వ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ సొసైటీ ఎన్నికలు బాలాజీ నగర్ పోచమ్మ గుడి ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల ఎలక్షన్ ఆఫీసర్స్ గా ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్, విజయ్ కుమార్ వ్యవహరించగా పసునూరి మనోహర్, ఆర్మీ రవికుమార్, రాజారపు యాదగిరి, పడకంటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కే సురేందర్, కోశాధికారిగా పి సమ్మయ్య గెలుపొందినారన్నారు. వీరిని కాలనీ కి సంబంధించిన పెద్దలు మేకల ఉపేందర్, మల్లారెడ్డి, సంపత్, సాగర్ రెడ్డి, మల్లేష్ అశోక్, భూపాల్ రెడ్డి, పి నరసయ్య, దామెర వెంకటస్వామి అంజయ్య తదితరులు అభినందించినారు. అనంతరం నూతన అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, గత రెండు సంవత్సరాలుగా సేవలందించిన పాత కమిటీ ని



సన్మానించారు. నూతనంగా ఎన్నికైన తక్కల్లపల్లి శ్రీనివాసరావు, కంకణాల సురేందర్, పొక్కుల సమ్మయ్య లను కాలనీవాసులు అందరూ కలిసి సన్మానించి, భవిష్యత్తులో కాలనీకి సంబంధించిన అభివృద్ధి పనులలో కాలనీ పెద్దలతో సంప్రదిస్తూ ముందుకు సాగాలని కోరారన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అభివృద్ధిలో భాగస్వాములమై అందరిని కలుపుకొని పనిచేస్తామని ప్రమాణం చేశారు.

# ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - అంబేడ్కర్ నగర్ యూపీహెచ్‌సీ తనిఖీ**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైద్య అధికారులు, ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్బన్ పీ హెచ్ సీ లో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. గర్భిణులు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై అవగాహన కల్పించాలని నిరంతరం పరీక్షలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ఆసుపత్రికి వచ్చే వారికి వివరించాలని తెలిపారు.

# 30 మందిని కారుతో ఢీకొట్టిన ఆర్మీ అధికారి

ముంబై: ఒక ఆర్మీ అధికారి మద్యం సేవించి కారు డ్రైవ్ చేశాడు. తాగిన మత్తులో సుమారు 30 మందిని కారుతో ఢీకొట్టాడు. అదుపుతప్పిన ఆ కారు డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. ఈ నేపథ్యంలో స్థానికులు ఆ ఆర్మీ అధికారిని చుట్టుముట్టి కొట్టారు. అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. 40 ఏళ్ల హర్ష్‌పాల్ మహాదేవ్ వాగ్మారే ఆర్మీ అధికారి. అస్సాంలో విధులు నిర్వహిస్తున్న ఆయన నాలుగు రోజులు సెలవుపై మహారాష్ట్రకు వచ్చాడు. కాగా, ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆర్మీ అధికారి హర్ష్‌పాల్ మహాదేవ్ నాగ్‌పూర్‌లోని నాగర్ధాన్‌లోని దుర్గా చౌక్ మీదుగా హమ్లాపురికి కారులో వెళ్తున్నాడు. అయితే మద్యం సేవించిన ఆయన కారును నిర్లక్ష్యంగా డ్రైవ్ చేశాడు. వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో సుమారు 30 మందిని ఢీకొట్టాడు. ఆ తర్వాత డ్రైనేజీలోకి కారు దూసుకెళ్లి బోల్తా పడింది. మరోవైపు ఈ సంఘటనపై స్థానికులు ఆగ్రహించారు. మద్యం సేవించి ఉన్న ఆర్మీ అధికారి హర్ష్‌పాల్ మహాదేవ్‌ను కారు నుంచి బయటకు లాగారు. గాయపడిన ఆయనపై దాడి చేశారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ ఆర్మీ అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రజలకు చేరువ కావడమే లక్ష్యం

**- ఆ దిశగా పోలీస్ శాఖ కృషి**
**- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధించిన అధికారులను కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 48 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఫిర్యాదు దారులతో నేరుగా ఫోన్లో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదాగా మాట్లాడి.. వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి.. బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఎస్పీ ఆఫీస్ కి, పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని, బాధితులు మాత్రమే వచ్చి ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని సూచించారు.

# 'మోడీ గిఫ్ట్' సైకిళ్ల పంపిణీ




**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో 'మోడీ గిఫ్ట్' పేరిట సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు రామడుగు, గుండి గోపాల్‌రావుపెట్, రుద్రారం, వెదిర, వెలిశాల, దేశరాజుపల్లి గ్రామాల్లో విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మేకల ప్రబాకర్ యాదవ్, మాజీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కట్ట రవీందర్, మండల పార్టీ అధ్యక్షులు మోడీ రవి, జన్నారం విద్యాసాగర్, ఉప్పు రామకృష్ణ, జిట్ట వేణి అంజిబాబు, పొచంపల్లి నరేష్, ఉప్పు శ్రీనివాస్, పూరెల్ల శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆఫీసర్స్.. బీ అలర్ట్



పరిస్థితుల్లో ఈ బృందాలను వినియోగించుకోవాలని వెల్లడించారు. ఆపద మిత్ర వాలంటీర్ల సేవలు కూడా ఉపయోగి ంచుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ లోని 66 డివిజన్ల కార్పొరేటర్లు, సంబంధిత అధికారులతో వాట్సఅప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే నేపథ్యంలో ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

**- ముందస్తు చర్యలపై కలెక్టర్ల వివరణ**

ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ.. ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలను చేసుకొని ఉంటే సునాయసంగా వరదనుండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవచ్చునని చెప్పారు. నగరం వరద ముంపు నివారణకు తీసుకొంటున్న ముందస్తు చర్యల విషయంపై హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరిష్, డాక్టర్ సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్ పాయి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌కు వివరించారు. అనంతరం అరవింద్ కుమార్ క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి నయీంనగర్ నాలా, రాజాజీ నగర్ కల్వర్టు, ప్రెసిడెంట్ పాఠశాల నుంచి నయీంనగర్ వరకు నిర్మించిన రిటెయినింగ్ వాల్, జవహర్‌నగర్, సమ్మయ్య నగర్, భద్రకాళి చెరువు ఎఫ్‌టిఎల్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఉప కమిషనర్లు రవిందర్, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్, డిఆర్ఎఫ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

తెలుగును తెలుగులో రాయలేమా?

మాతృ భాష.. అమ్మ భాష.. మదర్ టంగ్.. ఎలా చెప్పినా, ఏ భాషలో చెప్పినా సొంత భాష ప్రాధాన్యం ఉండి తీరుతుంది. తెలంగాణ తల్లి/ తెలుగు తల్లి అనగానే భావోద్విగ్నంగా ముడిపడతాం. పడాలి కూడా. భాసించేది భాష. అంటే వెలిగేది, వెలుగును పంచేది. అంటే నిజమైనవెలుగు గురించి చెప్పాలన్నా కాంతిమంతంగా వెలిగే భాష లేకపోతే సాధ్యం కాదన్నమాట.

అందుకే మండే సూర్యుడి వెలుగును సంకేతిస్తూ భాస్కరుడు అంటున్నాం. మాట కూడా అంతటి సూర్యుడికి తక్కువేమీ కాదని భాష అంటున్నాం. మాట్లాడే భాష, రాసే భాష, మాండలిక భాష, ప్రామాణిక భాష, భాషా భేదాలు, భాషా భాగాలు, భాషా శాస్త్రం, భాషోత్పత్తి శాస్త్రం, మెదడు-భాష, భాష- ఆలోచనలు, భాష- సృజనాత్మకత, భాష- అభివృద్ధి%ఔ% ఇవన్నీ చాలా లోతైన అంశాలు. ఏ కొద్ది మందికో తప్ప ఎవరికీ పట్టవు. భారతదేశంలో మాతృభాష పరిరక్షణలో తమిళుల స్ఫూర్తి, పట్టుదల ఇంకెవరికీ అబ్బలేదు. అది వారి రక్తంలో అణువణువునా ఉన్నది. మన రక్త పరీక్షలో లేదని తేలింది. ఇంకొన్నేళ్లకు తెలుగుభాష అంతరించిపోతుందని కొందరు అనవసరంగా భయపెడతారు. ఇంత ప్రామాణికమైన లిపి, వాడుక ఉన్న తెలుగు భాష అంతరించిపోదు. ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి లాంటివారు 50 ఏండ్ల కిందటే అంచనా వేసినట్టు కనీసం చివర క్రియాపదం ఒంటికాలి మీద అయినా తెలుగు బతికి ఉంటుంది. 'ట్రైన్ లేట్‌గా వచ్చింది. బ్యాంక్ బ్యాలెన్స్ అయిపోయింది. డోర్ ఓపెన్ కాలేదు. కార్ స్పీడ్‌గా వెళ్లింది' ఇలా మనం రోజువారీ వ్యవహారంలో అద్భుతమైన తెలుగు మాట్లాడుతున్నామనుకుంటున్న తెలుగులో ముప్పాతిక భాగం తెలుగు కాదు.

'ట్రైన్ ఈజ్ లేట్. దేర్ ఈజ్ నో బ్యాలెన్స్. డోర్ ఈజ్ నాట్ ఓపెనింగ్' అని మాట్లాడితే బాధపడాలి కానీ-చివర క్రియా పదంలో అయినా తెలుగుభాష వాడుతున్నందుకు అసలు మనల్ని మనమే అభినందించుకోవాలి. ముప్పాతిక భాగం భాష చచ్చి, పాతిక భాగమే బతుకుతున్నదని బాధపడటం దండుగ. ఆ మాత్రం అయినా బతికిస్తున్నాం కదా అనుకుంటే పండుగ.

తెలుగు భాషలో ఒత్తులు నేటితరానికి పెద్ద సమస్య. భాషా పండితులు, మేధావులు, శ్రేయోభిలాషులందరూ ఆలోచించి అసలు ఒత్తులే లేని తెలుగు భాషను ఆవిష్కరించడానికి ప్రయత్నించాలి. ఒత్తులు పలకలేని యాంకర్లను సానుభూతితో అర్థం చేసుకోవాలే గానీ, వారిని సంస్కరించడానికి ప్రయత్నించకూడదు. ఒత్తులు రాయలేనివారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పూర్తిగా ఇంగ్లిషులో రాయడంతో పోలిస్తే ఒత్తుల్లేకుండా అయినా తెలుగులో రాస్తున్నవారు దేవుళ్లతో సమానం. ఒత్తులేని జాతిని పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడుకోవాలి.

'భావం ప్రధానం కానీ, భాష ప్రధానం కాదు' అన్న ఆధునికుల సిద్ధాంతాన్ని భాషా శాస్త్రవేత్తలు నిండు మనసుతో, నిర్మాణాత్మక దృష్టితో, వాస్తవ స్థితిగతుల నేపథ్యంలో అంగీకరించాలి. తెలుగు భాష అంతరించకపోవచ్చు కానీ, తెలుగు లిపి మాత్రం కచ్చితంగా అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. దానికి మనమే కారణం. కానీ, మనం ఒప్పుకోం. సినిమా పాటలు విడుదల చేసినా.. భాష తెలుగే అయినా ఇంగ్లీషు లిపిలోనే ఉంటాయి. నెమ్మదిగా తెలు గు భాషను ఇంగ్లీషు లిపిలో రాయడం ఆచారం, పద్ధతి, ఫ్యాషన్‌గా అలవాటు చేశారు. మొన్నటిదాకా ఈ 'లిపి హత్యా' నేరాలు సినిమావారే చేసేవారు. ఇప్పుడు వారికి వాణిజ్య ప్రకటన లూ తోడయ్యాయి. 'మా తాజా కూరలే కొనండి' అన్న పిలుపును.. అని ఇం గ్లిష్ లిపిలోనే అఘోరించాలి. పొరపాటున తెలుగు లిపి లో రాస్తే పాత రాతియుగపు గుహల్లో చెకుముకి రాళ్ల ను రాజేసి వంట చేసుకునే ఆదిమ మానవులు అనుకుంటారన్న పరమ నాగరిక ఆలోచన అయినా ఉండి ఉం డాలి! లేదా వెంటనే పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని జైల్లో పెడుతారన్న భయమైనా ఉండి ఉండాలి.

మాయాబజార్లో పింగళి మాట 'పెళ్లి చేయమంటే కష్టం కానీబీ చెడగొట్టమంటే చిటికెలో పని' అన్నట్టు భాషను ఉద్ధరించాలంటే కష్టం కానీ, నాశనం చేయాలంటే చిటికెలో పని. రండి బాబు రండి! రండి తల్లీ రండి! తలా ఓ చెయ్ వేసి తెలుగు లిపిని నామరూపాల్లేకుండా చేద్దాం. తిలా పాపం తలా కడివెడు పంచుకుందాం.వారం, పది రోజుల వ్యవధిలో కొన్ని కోట్లమందిని ప్రభావితం చేయగల సినిమా అతి పెద్ద మాధ్యమం. మాస్ మీడియా. అలాంటి సినిమాల్లో ఏటికి ఎదురీదుతూ పట్టుమని నలుగురైనా తెలుగు భాషను, వ్యక్తీకరణను, సంస్కృతిని, మొత్తంగా తెలుగుతనాన్ని పట్టుకొని వేలాడుతున్నందుకు వారికి ప్రత్యేకంగా నమస్కరించాలి. ఏనాడో భాషా శాస్త్రవేత్తలు లెక్కకట్టినట్టుగా%ఔ% తెలుగు సినిమాల్లో ముప్పాతిక శాతం ఇంగ్లిషును విధిగా వాడాలి. అర్థం లేని ఆరు పాటల్లో అర్థమున్న రెండుపాటలైనా పూర్తిగా ఇంగ్లీషు భాషలోనే పెట్టాలి. దీనికి హాలీవుడ్‌కు వెళ్లాల్సిన పనే లేదు. మన వాళ్లెవరైనా, అందమైన తెలుగు రాయమంటే వణికిపోతారు కానీ, ఇంగ్లిషులో రాయమన్నా, పాడమన్నా అది మనకు వెన్నతో పెట్టిన మిథ్య. ఎలాగూ డిజిటల్ మీడియా అవసరాలు బాగా పెరిగాయి కాబట్టి పాటలకే కాకుండా మాటలకూ ఇంగ్లిష్ లిపిలో అక్షరాలు సినిమా మొత్తం వేయాలి. అసలు తెలుగు సినిమా మొత్తానికి ఇంగ్లిషు లిపిలో అక్షరాల్లేకపోతే సెన్సార్ వారు అనుమతించకూడదు. తెలుగు భాషను ఇంగ్లీషు లిపిలోకి దించుతున్న పుణ్య పురుషులకు ఉత్తమ లిప్యంతరీకరణ అవార్డులను ఇబ్బడి ముబ్బడిగా ఇవ్వాలి! మన పొరుగున కర్ణాటక సముద్రతీరం మంగళూరు-ఉడిపి ప్రాంతాల్లో తుళు మాట్లాడతారు. తుళు ప్రత్యేక భాషే అయినా, కోటి మందికి పైగా తరతరాలుగా మాట్లాడుతున్నా ఇప్పుడు లిపి లేదు. కన్నడ లిపిలోనే తుళు భాషను రాయాలి. నిజానికి ఆరు వందల ఏండ్ల కిందటి దాకా తుళుకు ప్రత్యేక లిపి ఉండేది. అనేక కారణాల వల్ల ఆ లిపి అంతరించిపోయింది. కృష్ణదేవరాయల మాతృభాష తుళు. తుళు తన సొంత లిపిని మరిచిపోయి, కన్నడ లిపిలోకి కుచించుకుపోయినట్టుమన తెలుగు లిపి కూడా ఇంగ్లిషులోకి కుచించుకుపోయి సొంత లిపిని పూర్తిగా మరిచిపోయే రోజులు ఎంతో దూరంలో లేవు. ఒక లిపి ఏర్పడటానికి వేల ఏండ్ల సమయం పడుతుంది. మొనదేలిన రాయి ప్రవాహంలో ఒరుసుకుని, ఒరుసుకుని నున్నగా, గుండ్రంగా తయారైనట్టు తెలుగు లిపి కూడా గుండ్రంగా, అందంగా ఏర్పడింది. నవ్వుతున్నట్టు 'అ' అక్షరం ఎంత అందంగా ఉంటుంది? పురివిప్పిన నెమలిలా 'ఖ' ఉంటుంది. కీర్తికి పెట్టిన కిరీటంలా 'గ' ఉంటుంది. బుగ్గన సొట్టలా 'ఠ' ఉంటుంది. రాయంచలా 'హ' ఉంటుంది. తెలుగు వర్ణమాల అచ్చులు, హల్లుల అందం, అవి ఏర్పడిన పద్ధతి మనకు పట్టని పెద్ద గ్రంథం. భాషకు శాశ్వతత్వం ఇచ్చేది, తరతరాలకు భాషను అందజేసేది లిపి. మాట్లాడే మొత్తం భాషకు ఒక్కోసారి లిపి చాలకపోవచ్చు. తెలుగులో దాదాపుగా మాట్లాడే భాషకు తగిన, బాగా దగ్గరైన వర్ణమాల ఉంది. అంత నిర్దుష్టమైన, నిర్దిష్టమైన లిపి తెలుగుకు ఉన్నది. ముత్యాల్లాంటి, రత్నాల్లాంటి తెలుగు అక్షరాలు మనకెందుకో వికారంగా కనిపిస్తాయి. అసహ్యించుకోవాల్సినవిగా అనిపిస్తున్నాయి. వాడకూడనివిగా అనిపిస్తాయి. తెలుగు భాష అవసరాలకే అయినా తెలుగు లిపిలో రాయడం తక్కువతనంగా అనిపిస్తుంది. తెలుగుకు తెలుగు లిపే అంటరానిదిగా అవుతున్నది. తెలుగును ఇప్పుడు ఇంగ్లిషులో రాయడం ఫ్యాషన్, మర్యాద, ట్రెండ్ అన్నింటికీ మించి తెలుగు భాషను తెలుగు లిపిలో నే రాసే మైనారిటీ జాతి మీద భవిష్యత్తు లో దాడులు జరుగకుండా గట్టి భద్రత కల్పించాలి!

# నైట్ డ్యూటీలు రద్దు చేయాలి

**- మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు.. - సీఐటీయూ డిమాండ్**

**వేద న్యూస్, పార్వతీపురం:**

పార్వతీపురం మండలకేంద్రంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రాత్రిపూట నిబంధనలకు విరుద్ధంగా విధులు అప్పగించడం వల్ల అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వీరికి కనీస ప్రమాద నివారణ చర్యలు మున్సిపల్ యంత్రాంగం చేపట్టడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి వి రమణ, కోశాధికారి జీ వీ రమణ విమర్శించారు. సోమవారం పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో సాలూరు ,పాలకొండ పక్క జిల్లాలోని బొబ్బిలి పట్టణాలలో రాత్రిపూట పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, కేవలం పార్వతిపురంలోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం కార్మికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వివరించారు. రాత్రిపూట విధులను రద్దుచేసి.. యథావిధిగా పగటి పూట విధులను కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు, లేనియెడల ఈ సమస్యపై మున్సిపల్ కార్మికులను ఐక్యం చేసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు బి బాల, భాను ప్రసాద్, మహేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# పాక్‌లో కొనసాగుతున్న మృత్యుఘోష

- పాకిస్థాన్‌లో రుతుపవనాల బీభత్సం
- 140 మంది చిన్నారులు సహా 299 మంది మృతి
- 700 మందికి పైగా గాయాలు, 1600కు పైగా ఇళ్ల ధ్వంసం
- జూన్ 26 నుంచి కొనసాగుతున్న కుండపోత వర్షాలు
- పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 162 మంది మరణం



**వేదన్యూస్ డెస్క్:**

పాకిస్థాన్‌లో రుతుపవనాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. జూన్ చివరి వారం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 299 మంది ప్రాణాలు కోల్పోగా, వీరిలో 140 మంది చిన్నారులే ఉండటం అందరినీ కలచివేస్తోంది. భారీ వర్షాల వల్ల సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో తీవ్రమైన ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, మృతుల్లో 140 మంది చిన్నారులతో పాటు 102 మంది పురుషులు, 57 మంది మహిళలు ఉన్నారు. ఈ ప్రకృతి విపత్తులో మరో 715 మంది గాయపడగా, వారిలోనూ 239 మంది చిన్నారులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

వర్షాల ప్రభావం తూర్పు పంజాబ్ ప్రావిన్స్‌పై అత్యధికంగా ఉంది. ఇక్కడ ఒక్కచోటే 162 మంది మృతి చెందారు. దీని తర్వాత ఖైబర్ పఖ్తుంఖ్వాలో 69, సింధ్‌లో 28, బలూచిస్థాన్‌లో 20 మంది చొప్పున ప్రాణాలు కోల్పోయారు. ఈ వరదల కారణంగా 1,676 ఇళ్లు దెబ్బతినగా, వాటిలో 562 ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. సుమారు 428 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆగస్టు 4 నుంచి రుతుపవనాలు మరింత బలపడి దేశంలోని ఉత్తర, మధ్య ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించవచ్చని అంచనా వేసింది. దీంతో సహాయక బృందాలను, అత్యవసర సేవల విభాగాలను అధికారులు అప్రమత్తం చేశారు.

# శ్రీకృష్ణుడే తొలి మధ్యవర్తి..

**వేదన్యూస్ న్యూఢిల్లీ:**

వృందావన్‌లోని శ్రీ బంకి బిహారీ ఆలయం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదంపై ఇవాళ సుప్రీంకోర్టు స్పందించింది. శ్రీ కృష్ణ భగవానుడు తొట్టతొలి మధ్యవర్తి అని, ఆయన అడుగుజాడల్లో నడవాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. బంకి బిహారీ ఆలయానికి చెందిన 500 కోట్ల నిధులతో రీడెవలప్మెంట్ పనులు చేపట్టాలన్న అంశంపై వివాదం చెలరేగుతున్నది. ఆ కేసులో ఇవాళ సుప్రీంకోర్టు వాదనలు విన్నది. శ్రీ కృష్ణుడు తొలి మీడియేటర్ అని, ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ ట్రస్టు మధ్య ఉన్న వివాదం పరిష్కారం కోసం కమిటీని ప్రతిపాదిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.





ఆలయ నిదులను రహస్య వినియోగించే పద్ధతిని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఈ అంశంలో యూపీ సర్కారు వైఖరిని కోర్టు తప్పుపట్టింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చి ఈ ప్రతిపాదన చేశారు. ఆలయ నిధులను వాడుకోవాలని మే 15వ తేదీన ఇచ్చిన తీర్పును విత్‌డ్రా చేసుకోవాలని సుప్రీం తెలిపింది. గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నామని కోర్టు చెప్పింది. ట్రస్టీ సభ్యుల్లో మాజీ హైకోర్టు జడ్జీ లేదా సీనియర్ రిటైర్డ్ న్యాయవాది ఉంటారని పేర్కొన్నది. కమిటీ ఆదేశాల మేరకు ఆలయ వ్యవహారాలు కొనసాగుతాయని కోర్టు తెలిపింది. బంకి బిహారీ ఆలయ పునరుద్దరణ కోసం వినియోగించే నిధులపై తాత్కాలిక కమిటీకి అవకాశం ఇవ్వనున్నట్లు కోర్టు వెల్లడించింది. బంకి బిహారీ ఆలయాన్ని 1862లో నిర్మించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు ఆ ఆలయాన్ని విజిట్ చేస్తుంటారు. షిబాయితీలు ఆ టెంపుల్‌ను మ్యానేజ్ చేస్తున్నారు. వారసత్వ పురోహితులు అక్కడ పూజలు, నిర్వహణ చేస్తున్నారు. 2022 జన్మాష్టమి వేడుకల వేళ తొక్కిసలాట ఘటన జరిగింది. దీంతో అక్కడ ఆలయ పునరుద్దరణ చేపట్టాలని డిమాండ్ వచ్చింది. భక్తుల తాకిడీని తగ్గించేందుకు, రక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని యూపీ సర్కారును 2023 సెప్టెంబర్‌లో అలహాబాద్ కోర్టు ఆదేశించింది. తొక్కిసలాట ఘటన జరిగింది. దీంతో అక్కడ ఆలయ పునరుద్దరణ చేపట్టాలని డిమాండ్ వచ్చింది. భక్తుల తాకిడీని తగ్గించేందుకు, రక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని యూపీ సర్కారును 2023 సెప్టెంబర్‌లో అలహాబాద్ కోర్టు ఆదేశించింది.

వేద న్యూస్

మంగళవారం ఆగస్టు 05, 2025

# విమానంలో బొద్దింకలు

**వేదన్యూస్ డెస్క్:**

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం అనంతరం దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తోంది. ప్రమాదం తర్వాత నుంచి సంస్థకు చెందిన పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులతో నిత్యం వార్తల్లో నిలిచింది. తాజాగా ఆ సంస్థ మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచింది. ఈసారి విమానంలో బొద్దింకలే అందుకు కారణం. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబైకి వెళ్తున్న 180 విమానం లో బొద్దింకలు కనిపించడంతో గందరగోళం నెలకొంది. వీటివల్ల ఇద్దరు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో క్యాబిన్ సిబ్బంది సదరు ప్రయాణికులను అదే క్యాబిన్‌లోని వేరే సీట్లకు మార్చారు. ఆ తర్వాత విమానం ఫ్యూయల్ ఫిల్లింగ్‌కోసం కోల్‌కతాలో ఆగినప్పుడు గ్రౌండ్ సిబ్బంది విమానాన్ని డీప్ క్లీన్ చేసినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. సాధారణంగా తమ సిబ్బంది విమానాలను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తారని, అయితే కొన్నిసార్లు




గ్రౌండ్ ఆపరేషన్ల సమయంలో కీటకాలు విమానంలోకి ప్రవేశిస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# లక్షలాది భారతీయుల ఖాతాలపై కీలక నిర్ణయం

## - దుర్వినియోగం, హానికరమైన ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో నిలిపివేత

**వేదన్యూస్ డెస్క్:**


భారత్‌లో 98 లక్షల ఖాతాలను నిలిపి వేసినట్లు వాట్సాప్ సంస్థ వెల్లడించింది. జూన్ మాసం ఒక్క నెలలోనే ఈ ఖాతాలను నిలిపి వేసినట్లు తెలిపింది. జూన్ నెల వారీ నివేదికపై సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. దుర్వినియోగం, హానికరమైన ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. అదే సమయంలో వచ్చిన ఫిర్యాదులపై సైతం ఈ సంస్థ స్పందించింది. వాట్సప్ వేదికగా చేసుకుని.. దానిని దుర్వినియోగం చేస్తుందనే విషయాన్ని గుర్తించినట్లు చెప్పింది. ఇక భారత్‌లోని వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదులను సైతం పరిష్కరించినట్లు ఈ సంస్థ తెలిపింది. జూన్ మాసంలో 23,596 ఫిర్యాదులు అందాయని.. వాటిలో 1,001 ఖాతాపై చర్యలు తీసుకున్నట్లు చెప్పింది. అయితే అందిన ఫిర్యాదుల్లో కొన్ని బ్యాన్ అప్పీళ్లకు లింక్ చేయబడ్డాయని.. ఫలితంగా 756 ఖాతాలపై చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ తరహా చర్యలను ఎప్పుడో ఆపడం కంటే.. ప్రారంభంలోనే నిలిపి వేయడం మంచిదని వాట్సప్ అభిప్రాయపడింది.



ఈ చర్యలను మూడు స్థాయిల్లో నిలిపి వేయ వచ్చని సూచించింది. ఖాతా సెటప్ సమయంలో.. సందేశం పంపేటప్పుడు.. ప్రతికూల అభిప్రాయంపై ప్రతిస్పందన తదితర మూడు కీలక దశలలో దీని దుర్వినియోగాన్ని గుర్తించ వచ్చని వాట్సప్ సోదాహరణగా వివరించింది. ఇక రిజిస్ట్రేషన్, సందేశాలు పంపే సమయం, ఫిర్యాదులు ఆధారంగా స్పందిస్తామని పేర్కొంది. మరోవైపు ఈ ఏడాది జనవరి.. ఒక్క నెలలోనే దాదాపు 99 లక్షల (10 మిలియన్లు) భారతీయ ఖాతాలను వాట్సాప్ నిషేధించిన సంగతి తెలిసిందే. ఆ ఒక్క నెలలోనే భారీ స్థాయిలో అకౌంట్లను ఈ సంస్థ తొలగించింది.

# రాష్ట్రపతి, ప్రధాని మోదీలను కలిసిన అశోక్ గజపతిరాజు

**వేదన్యూస్ డెస్క్:** గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు బాధ్యతలను స్వీకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ గా నియమితులైన తర్వాత ఆయన తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా తొలుత ఆయన రాష్ట్రపతి భవన్ కు చేరుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. అనంతరం పార్లమెంటుకు వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రామ్మోహన్ నాయుడులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. పార్లమెంటు వద్ద అశోక్ గజపతిరాజుకు టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు.



# సత్తా చాటిని కర్నూలు జిల్లా క్రీడాకారులు

ఆగస్టు 2,3 తేదీలలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా జరిగిన ఇన్విటేషనల్ హాండ్ బాల్ టోర్నమెంట్ లో కర్నూలు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఏకంగా ఛాంపియన్షిప్ ను కైవసం చేసుకున్నారు. ఆంధ్ర తెలంగాణ నుంచి 20 జట్టులు పాల్గొన్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి రుద్రా రెడ్డి తెలిపారు. విజేతను ఆయన అభినందించారు.



# వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ విజేత దక్షిణాఫ్రికా

ఈఏడాది దక్షిణాఫ్రికా పట్టిందల్లా బంగారమే అవుతోంది. ఈమధ్యే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలుపొందిన సఫారీ జట్టు.. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ విజేతగానూ అవతరించింది. ఏబీ డివిలియర్స్ (120 నాటౌట్) మెరుపు శతకంతో ప్రొటీస్ జట్టు తమ కలను సాకారం చేసుకుంది. పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో జరిగిన ఫైనల్లో మిస్టర్ 360 విధ్వంసం సృష్టించాడు. కేవలం 60 బంతుల్లోనే డివిలియన్స్ సెంచరీ బాదేయగా.. దక్షిణాఫ్రికా ఛాంపియన్స్. 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. దాంతో, రెండో సీజన్‌లో ట్రోఫీని అందుకున్న పాక్ రన్నరప్‌గా సరిపెట్టుకుంది. మాజీ ఆటగాళ్లు ఒక్క చోట చేరి ఆడుతున్న వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్‌లో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. లీగ్ దశ నుంచి దుమ్మురేపుతున్న సఫారీ జట్టు ఫైనల్లోనూ పంజా విసిరింది. ఇండియా ఛాంపియన్స్ సెమీస్ నుంచి వైదొలగడంతో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో తలపడిన జాక్వెస్ కలిస్ నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత ఆడిన పాక్‌కు ఓపెనర్ షర్జీల్ ఖాన్ (76) శుభారంభం ఇచ్చాడు. మిడిలార్డర్‌లో ఉమర్ అమిన్(36), అసిఫ్ అలీ(28)లు రాణించడంతో పాక్ నిర్ణీత ఓవర్లలో రన్స్ చేసింది. తొలి వికెట్‌కు 72 రన్స్ : అనంతరం పాక్ నిర్దేశించిన భారీ ఛేదనను సఫారీ ఓపెనర్లు ఏబీ డివిలియర్స్(120 నాటౌట్), హాషీం ఆమ్లా(18) ధాటిగా ఆరంభించారు. తొలి వికెట్‌కు 72 రన్స్ కలిపిన ఈ జోడీని అజ్మల్ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో ఆమ్లా షాట్‌కు యత్నించి రాయిస్ చేతికి చిక్కాడు. తొలి వికెట్ పడినా.. డివిలియర్స్ తన జోరు తగ్గించలేదు. జీన్ పాలు డుమినీ(50 నాటౌట్)తో కలిసి పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇద్దరూ దంచేయడంతో ప్రొటీస్ జట్టు గెలుపు దిశగా సాగింది. 12 ఫోర్లు, 7 సిక్సర్లు బాదిన డివిలియర్స్ శతకం సాధించగా.. డుమినీ సూపర్ ఫిఫ్టీతో తమ జట్టును మొదటిసారి ఛాంపియన్‌గా నిలిపారు. దాంతో, రెండో పర్యాయం టైటిల్ ముద్దాడాలనుకున్న పాక్ ఆశలు ఆవిరయ్యాయి.




# జో రూట్ రికార్డులు పర్వం..!
# భారత్‌పై పదమూడో సెంచరీ


సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ క్రికెటర్ జో రూట్ రికార్డులు పర్వం లిఖిస్తున్నాడు. స్వదేశంలో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల అండర్సన్ %-% టెండూల్కర్ ట్రోఫీలో శతకాల మోత మోగిస్తున్న అతడు.. సిరీస్‌లో కీలకమైన ఓవల్ మైదానంలోనూ సెంచరీ బాదాడు. ఆకాశ్ దీప్ ఓవర్లో డబుల్స్ తీసి.. భారత్‌పై పదమూడో వందతో చరిత్ర సృష్టించాడు రూట్. తద్వారా ఒకే జట్టుపై అత్యధిక రన్స్ చేసిన మూడో ఆటగాడిగా రూట్ రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ ముందున్నాడు. ఈ దిగ్గజ ప్లేయర్ ఇంగ్లండ్‌పై ఏకంగా 19 సెంచరీలు కొట్టాడు. వెస్టిండీస్‌పై 13 శతకాలు సాధించిన భారత లెజెండ్ సునీల్ గవాస్కర్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జట్టుకు అవసరమైన సమయంలో బ్యాటుతో బదులిచ్చే రూట్ ఓవల్‌లో వందతో అలరించాడు. భారత బౌలింగ్ దళాన్ని అసహనానికి గురి చేస్తూ టీ బ్రేక్ తర్వాత అతడు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిది 39వ శతకం. ఓవల్ టన్‌తో రూట్ శ్రీలంక వెటరన్ కుమార సంగక్కర రికార్డును బ్రేక్ చేశాడు.




ప్రస్తుతం అత్యధిక శతక వీరుల జాబితాలో అతడు నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఓవరాల్‌గా 51 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ టాప్‌లో ఉండగా.. దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్(45) రెండో స్థానంలో,. ఆస్ట్రేలియా మాజీ సారథి రికీ పాంటింగ్(41) మూడో ప్లేస్‌లో ఉన్నారు. స్వదేశంలో బ్యాట్‌తో హడలెత్తించే రూట్ .. అత్యధికంగా 24 సార్లు మూడంకెల స్కోర్ అందుకోవడం విశేషం. పాంటింగ్, కలిస్, జయవర్ధనేలు 23 శతకాలతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు.

# పాక్‌పై విండీస్ ఉత్కంఠ విజయం
# హోల్డర్ ఆల్‌రౌండ్ షో

వెస్టిండీస్ ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. ఆస్ట్రేలియాతో టెస్టు, టీ20 సిరీస్‌ల్లో వైట్‌వాష్ ఎదుర్కొన్న విండీస్..పాకిస్థాన్‌పై సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. ఆదివారం తెల్లవారుజామున(భారత కాలమానం ప్రకారం) జరిగిన రెండో టీ20లో 2 వికెట్ల తేడాతో పాక్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ కాస్తా ప్రస్తుతం 1-1తో సమమైంది. పాక్ నిర్దేశించిన 134 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ 8 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఓపెనర్లు అలిక్ అతానజె(2), జెవెల్ అంద్రూ(12) ఘోరంగా విఫలమవగా, కెప్టెన్ షాయ్‌హోప్(21), రోస్టన్ చేజ్(16), మోతీ(28) జట్టును పోటీలో నిలిపారు. చివర్లో రొమారియో షెఫర్డ్(15)తో కలిసి జాసన్ హోల్డర్(16 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. చివరి బంతికి ఫోర్ కొట్టిన హోల్డర్ జట్టుకు ఉత్కంఠ విజయాన్ని అందించాడు. నవాజ్, సయిమ్ ఆయూబ్ రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు హోల్డర్(4-19) ధాటికి పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 133-9 స్కోరు చేసింది. హసన్ నవాజ్(40), ఫకర్ జమాన్(20) రాణించారు. హోల్డర్ బౌలింగ్ ధాటికి పాక్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించిన హోల్డర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో టీ20 సోమవారం జరుగనుంది.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073